


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 63 | ఆదివారం 11 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి,

- మిగతా 2లో..

# ఢిల్లీలో ఎమర్జెన్సీ!

- సీఈసీ జ్ఞానేశ్‌కు వ్యతిరేకంగా సీజేపీ నిరసనలు
- అడుగడుగునా నిర్బంధాలు
- విమానంలోనే అభిజిత్ దీప్కే అరెస్ట్
- మద్దతుగా బయలుదేరిన మమత, కేజ్రీవాల్, విజయన్, మాణిక్ సర్కార్ కూడా..!
- 7,000 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఎంత మంది పోలీసులను పంపినా వెనక్కి తగ్గబోం: రాహుల్ గాంధీ
- ఇండీ కూటమి ఆధ్వర్యంలో రేపు సీజేఐకి వినతిపత్రం.. భారీ నిరసన





న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతున్నది. అడుగడుగునా అరెస్టులు.. నిర్బంధాలు.. ముళ్లకంచెలు.. పోలీసుల మోహరింపు.. ఇంటర్నెట్ బంద్.. ఇలా ఆందోళనలపై ఆంక్షలతో జంతర్ మంతర్ సహా పరిసరాలన్నీ ఎమర్జెన్సీని తలపిస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న హైటెన్షన్ వాతావరణం(ఎఅస్త్రష్ట్‌వఅ- ంఆశీఅ ఫ్‌ఎశీంజూష్ట్రవతీవ) నెలకొన్నది. ఈ నెల 6న ఇండీ కూటమి ర్యాలీతో మొదలైన నిరసనల హోరు శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పోరాటంతో మరింత ఉధృతమైంది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ముందుగా ప్రక టించినట్లు శనివారం ఉదయం జంతర్‌మంతర్‌లో ధర్నాకు సీజేపీ సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రు లు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయ్ విజయన్, మాణిక్ సర్కార్ సహా ప్రతిపక్ష పార్టీలు కూడా 'కాక్రోచ్'కు మద్దతుగా నిరసనలకు దిగాయి.

అయితే.. శుక్రవారం రాత్రే జంతర్‌మంతర్ పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. శనివారం నిరసన తెలిపేందుకు



## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'..

- ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్
- ఢిల్లీలో ఆంక్షలు విధించడంపై కాంగ్రెస్ అభ్యంతరం
- యువత నిరసన హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపణ
- మోదీ, అమిత్ షాలపై ప్రియాంకా విమర్శలు
- ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న జైరాం రమేశ్
- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ 1

- 25 లక్షల మంది రైతులు లక్ష్యం: సీఎం చంద్రబాబు
- ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం
- రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడమే లక్ష్యం
- రసాయనాలతో పోలిస్తే ప్రకృతి సాగుతో 47 శాతం పెరిగిన రైతుల ఆదాయం
- రసాయన ఎరువుల వాడకం తగ్గించినందుకు కేంద్రం నుంచి రూ.218 కోట్ల ప్రోత్సాహకాలు
- జీవామృతం తయారీ కోసం రాష్ట్రంలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని వెల్లడి



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. "రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో

- మిగతా 2లో..



# విజయవాడలో టెన్షన్..

- షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు
- 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు
- సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి నిరసన
- కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు

విజయవాడ - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు శనివారం గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో

- మిగతా 2లో..

# వచ్చే జూన్ వరకు యాక్షన్ ప్లాన్ ఉండాలి

- 'ఎల్ నినో'ను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి
- తాగు, సాగునీటి ఎద్దడి రానివ్వొద్దు
- విద్యుత్ కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడేది లేదు
- ఎల్ నినోపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

- మిగతా 2లో..



# సమరానికి సై!

- 14న మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్
- 19న మండల, జడ్పీ ఎన్నికల షెడ్యూల్
- వచ్చే నెలలో పంచాయతీ పోరు
- 3 దశల్లో నిర్వహణకు కసరత్తు
- 13న గుర్తింపు పొందిన 20 రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం

2లో

## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

**నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ**

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతి యుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.

**ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్**

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

**అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?**

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది. ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

## విజయవాడలో టెన్షన్..

(మొదటిపేజీ తరువాయి)




తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'..

(మొదటిపేజీ తరువాయి)

ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

## ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ 1

(మొదటిపేజీ తరువాయి)

87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి," అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు.

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఎమర్జెన్సీ!

(మొదటిపేజీ తరువాయి)

విముంబై నుంచి విమానంలో బయలుదేరిన సీజేపీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే, ఆయన అనుచరులను ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానంలోనే అరెస్ట్ చేశారు. ఇలాంటి పరిస్థితులు ఇందిరాగాంధీ హయాంలో కూడా లేవని.. ఎమర్జెన్సీని మించి మోదీ సర్కార్ వ్యవహరిస్తున్నదని దీప్కే మండిపడ్డారు. బస్టాండ్‌లో ధర్నాకు దిగిన మమతా బెనర్జీని, ర్యాలీగా బయలుదేరిన అర్వింద్ కేజ్రీవాల్‌ను, మద్దతు తెలిపేందుకు వచ్చిన పినరయ్ విజయన్, మాణిక్ సర్కార్ సహా దాదాపు మూడువేల మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుల సందర్భంగా తీవ్ర తోపులాట జరిగింది.

**విమానం దిగకముందే..!**

కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కేతోపాటు ఆ పార్టీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా తదితరులు జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనేందుకు శనివారం ఉదయం ముంబై నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. హస్తినలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ కాగానే.. అప్పటికే అక్కడికి చేరుకున్న ఐబీ, సీఐఎస్ఎఫ్, ఢిల్లీ పోలీసులు విమానంలోకి వెళ్లారు. ముఖ్యంగా మహిళా పోలీసులు ముందుండి..

దీప్కే సహా సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. 'విమానంలో నుంచి దిగకముందే అరెస్ట్ చేయడానికి పోలీసులు వస్తున్నారు చూడండి. రండి మేడమ్.. రండి! అరెస్ట్ చేయండి. మేం భయపడం. ఇందిరాగాంధీ హయాంలో కూడా ఇలాంటి నిర్బంధాలు ఈ దేశం చూడలేదు. కానీ, ఇప్పుడు ఎమర్జెన్సీని మించి పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెనక్కి తగ్గబోం. సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు, సర్‌ను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదు' అంటూ విమానంలోనే మీడియాతో దీప్కే మాట్లాడుతూ కనిపించారు. ఈ వీడియోను సీజేపీ తన సోషల్ మీడియా ఖాతాలో విడుదల చేసింది. అరెస్టును ముందే ఊహించిన అభిజిత్ దీప్కే ముంబై నుంచి బయలుదేరేటప్పుడే ఓ ప్రకటన రిలీజ్ చేశారు. 'నన్ను, మా మిత్రులను పోలీసులు అరెస్ట్ చేసినా.. ఎవరూ వెనక్కి తగ్గొద్దు. శాంతియుతంగా, చట్టబద్ధంగా నిరసన తెలపాలని కోరుతున్న. ప్రజల ఆస్తులకు గానీ, ప్రభుత్వ ఆస్తులకు గానీ ఎలాంటి నష్టం కలిగించకుండా నిరసనను కొనసాగిద్దాం' అని పిలుపునిచ్చారు. యువతను చూసి కేంద్ర ప్రభుత్వం ఎంత భయపడుతున్నదో ప్రస్తుత పరిస్థితులు చూస్తే అర్థమవుతున్నదని ఆయన అన్నారు. ఢిల్లీ ఏమైనా మోదీ, అమిత్ షా ప్రైవేట్ ఆస్తులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, అభిజిత్ దీప్కే, ఆయన అనుచరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు గుర్తుతెలియని ప్రాంతాలకు తరలించారు.

**దీదీ, కేజ్రీ, విజయన్, మాణిక్ సహా..**

సీజేపీ నిరసనలకు మద్దతుగా ఢిల్లీ జంతర్ మంతర్‌కు ప్రతిపక్ష పార్టీలతోపాటు ప్రజా సంఘాల నాయకులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా బయలుదేరగా.. ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశాను. నిర్బంధంలోకి తీసుకున్నారు. కొందరిని గృహనిర్బంధం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ(దీదీ) తన పార్టీ నేతలతో కలిసి సౌత్ అవెన్యూలోని ఓ బస్టాండ్‌లో ధర్నాకు దిగారు.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని, ఆయన రాజీనామా చేయాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. మమతతోపాటు టీఎంసీ నేతలు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్ సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి.. ద్వారకా నార్త్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను పోలీసులు కిడ్నాప్ చేశారని, ఇక్కడి నుంచి కదలబోమంటూ ఠాణాలోనే దీదీ ధర్నాకు దిగారు. ఇక, ఢిల్లీలోని అరవింద్ కేజ్రీవాల్ ఇంటి పరిసరాల్లో తెల్లవారుజామునే పోలీసులు భారీగా మోహరించారు. జంతర్ మంతర్‌కు అనుచరులతో ఆయన బయలుదేరేందుకు సిద్ధమవగా అరెస్ట్ చేశారు. విమానంలోనే కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులను అరెస్ట్ చేయడమంటేనే మోదీ ఎంత భయపడుతున్నారో అర్థమవుతుందని కేజ్రీవాల్ అన్నారు. ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని, వారికి తామంతా మద్దతిస్తామని తెలిపారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్‌లోని నివాసంలోనే పోలీసులు నిర్బంధించారు. అనంతరం అరెస్ట్ చేశారు. కేరళం మాజీ సీఎం పినరయ్ విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా సీజేపీకి మద్దతుగా జంతర్ మంతర్‌కు ర్యాలీగా బయలుదేరిన పలువురు సుప్రీంకోర్టు లాయర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక, ముంబై సహా ఇతర ఏరియాల్లోనూ అరెస్టుల పర్వం కొనసాగింది. ముంబైలో నిరసనకు దిగిన నటుడు ఇమ్రాన్ ఖాన్, యాక్టివిస్ట్ తుషార్ గాంధీ సహా 400 మందిని అదుపులోకి తీసుకున్నారు.

**నేడు కూడా సీజేపీ భారీ ఆందోళనలు**

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా, సీజేపీ పోరాటానికి మద్దతుగా ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చినవారిలో దాదాపు 7వేల మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వైపు ఎవరు వెళ్లినా.. అదుపులోకి తీసుకున్నారు. మద్దతుగా ఎక్కడ నిరసనలు జరిగినా అడ్డుకున్నారు. కాగా, అరెస్టు చేసినవాళ్లలో చాలా మందిని రాత్రి పోలీసులు విడుదల చేసినప్పటికీ ఇంకా సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే సహా పలువురిని రిలీజ్ చేయలేదు. దీంతో ఆదివారం భారీ ఆందోళనలకు సీజేపీ పిలుపునిచ్చింది.

**'జానీ జానీ ఎస్ పాపా.. జ్ఞానేశ్‌కుమార్ నో పాపా'**
**సెటైరికల్ పాట పాడిన మమత**

జంతర్ మంతర్‌లో నిరసనకు బయలుదేరే ముందు టీఎంసీ చీఫ్, బెంగాల్ మాజీ సీఎం మమతాబెనర్జీ ఓ సెటైరికల్ పాట పాడారు. 'జానీ జానీ ఎస్ పాపా, జ్ఞానేశ్‌కుమార్ నో పాపా.. జానీ జానీ ఎస్ పాపా, జ్ఞానేశ్‌కుమార్ అరెస్ట్ పాపా.. జానీ జానీ ఎస్ పాపా, మోదీ సర్కార్ నో పాపా..' అంటూ పాట రూపంలో విమర్శలు గుప్పించారు. ఓట్ల చోరీకి మోదీ సర్కార్ పాల్పడుతున్నదని, ఇందుకు జ్ఞానేశ్‌కుమార్ సహకరిస్తున్నారని ఆమె ఆరోపించారు. జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందేనని మమత డిమాండ్ చేశారు

## వచ్చే జూన్ వరకు యాక్షన్ ప్లాన్ ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి సవాళ్లు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావంపై శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటినుంచి వచ్చే జూన్ వరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ సమస్య తీవ్రతం మయ్యే ప్రమా దం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా డిమాండ్ మేరకు విద్యుత్‌ను కొను గోలు చేసేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడేదే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో విద్యుత్ లభ్యత అందుబాటు లో లేకపోవడం సవాలుగా మారిందన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా విని యోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్య మైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**చుక్క నీరు వృథా కావొద్దు..**

భవిష్యత్తులో తాగు, సాగునీటి ఇబ్బందు లు తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. నీటి వనరుల వినియో గం, నీటి పొదుపుపై ప్రత్యేక కార్యాచరణ రూ పొందించాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎల్ నినో, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అవగాహన కల్పించేందుకు సినిమా, మీడియా, కళాజాతలతో పాటు వివిధ ప్రచార మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి సమీక్షలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమరానికి సై!

అమరావతి– సూర్య వాస్తవం

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శనివారం క్యాబినెట్ ప్రత్యేకంగా సమావేశమైంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు నిర్ధారించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏర్పాటైన స్వతంత్ర కమిషన్ చేసిన సిఫారసులను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామాల్లో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ ఛైర్‌పర్సన్లు, మున్సిపల్ వార్డు సభ్యులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల వరకూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. మరోవైపు ఈ నెల 13న రాష్ట్రంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశమై స్థానిక ఎన్నికల నిర్వహణపై చర్చించనుంది. ఈ భేటీ అనంతరం 14న మున్సిపల్, 19న ప్రాదేశిక ఎన్నికలకు నోటిఫికేషన్‌తో పాటు షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నవంబరులో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

**ఎన్నికల సంఘం సిద్ధం**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. 13న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమైన అనంతరం 14న మున్సిపల్ ఎన్నికలకు, 19న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ నెలాఖరు నాటికి మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియను ముగించాలని నిర్ణయించింది. అలాగే నవంబరు 10 నుంచి 15వ తేదీ మధ్యలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల కానుంది. పంచాయతీలకు మూడు రోజుల వ్యవధిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. నవంబరు చివరి నాటికి మొత్తం పంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. డిసెంబరు మొదటి నుంచి రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలకు కొత్త పాలక వర్గాలు ఏర్పాటు కానున్నాయి.

ఈ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో దాదాపు రెండు నెలల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, ఇతర అంశాలపై వివరించేందుకు 13న గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశానికి ఆహ్వానించింది. విజయవాడలోని ఎస్ఈసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో 20 పార్టీలకు గుర్తింపు ఉండటంతో ఆయా పార్టీల అధినేతలకు ఆహ్వానపత్రాలను ఎస్ఈసీ అందించింది. పార్టీ అధ్యక్షులు లేదా పార్టీ గుర్తించిన ప్రతినిధులు సమావేశంలో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించింది.

## బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు మోసం చేశారు: వైఎస్ జగన్

అమరావతి– సూర్య వాస్తవం

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దారుణంగా మోసం చేశారని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో చంద్రబాబు వైఖరి బహిర్గతమైందని విమర్శించారు. చంద్రబాబును 'మిస్టర్ 420'గా అభివర్ణించిన జగన్, ప్రతి వర్గాన్ని అబద్ధపు హామీలతో మభ్యపెట్టడం ఆయనకు అలవాటేనని 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి బీసీలను ఆకట్టుకుని, ఇప్పుడు వారిని వంచించారని జగన్ ఆరోపించారు. ఈ మోసానికి గాను చంద్రబాబు వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలులో వైఫల్యం, గత



ప్రభుత్వ సంక్షేమ పథకాల రద్దు, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి దాదాపు రూ. 9 వేల కోట్ల బకాయిలను నిలిపివేయడం వంటి అంశాలను జగన్ ప్రస్తావించారు. 143 హామీలతో కూడిన కూటమి మేనిఫెస్టో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద మోసమని ఆయన దుయ్యబట్టారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను అక్టోబర్ 1న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధనను ఇది ఉల్లంఘిస్తోందని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు పెంచుతున్నట్లు గత ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

# సంపాదకీయం

## విశ్వసనీయత పునాదులు తవ్వుతారా




ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!" ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి

# రైతే రాజు అంటారు.. కానీ..

# రైతు జీవితంలో రాజసం ఎక్కడ..?

- నినాదాలకే పరిమితమైన రైతు గౌరవం..
- ఆచరణలో మాత్రం కష్టాలు, కన్నీళ్లు!
- దేశానికి అన్నం పెట్టే రైతన్నకు గిట్టుబాటు ధర ఎందుకు దక్కడం లేదు?
- తన పంటకు తానే ధర నిర్ణయించుకునే స్వేచ్ఛ ఎందుకు లేదు?



**అనంతపురం – సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :**
"రైతే రాజు".. ఈ మాట వినడానికి ఎంతో గొప్పగా ఉంటుంది. కానీ ఆ రాజసం రైతు జీవితంలో ఎక్కడ కనిపిస్తోంది? దేశానికి అన్నం పెట్టే అన్నదాత మాత్రం పెట్టుబడి భారంతో, నీటి కొరతతో, పెరుగుతున్న సాగు ఖర్చులతో, గిట్టుబాటు ధరల సమస్యలతో సతమతమవుతున్నాడు. పంట పండించేందుకు అహర్నిశలు శ్రమించినా, చివరకు తన శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుందనే భరోసా లేకుండా జీవిస్తున్నాడు.రైతు దేశానికి వెన్నెముక అని చెప్పే పాలకులు.. ఆ వెన్నెముక బలంగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? రైతు ఆదాయం పెరిగేలా, వ్యవసాయం లాభసాటిగా మారేలా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తీసుకొస్తున్నారు? ఇవి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన ప్రశ్నలు.

### ఇతరులకు ధర నిర్ణయించే స్వేచ్ఛ.. రైతుకే ఎందుకు లేదు?

ఒక వస్తువును తయారు చేసే వ్యాపారి తన ఉత్పత్తి ఖర్చు, రవాణా వ్యయం, ఇతర ఖర్చులు, ఆశించే లాభాన్ని లెక్కలోకి తీసుకొని ధర నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. కానీ రైతు పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, నీటి పారుదల, రవాణా.. ఇలా పెట్టుబడులు పెరుగుతున్నా, తన పంటకు ఎంత ధర రావాలో నిర్ణయించుకునే అధికారం రైతుకు లేదు.పంట పండించిన తర్వాత మార్కెట్‌లో ధర ఎంత ఉంటే అంతకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొన్నిసార్లు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని దుస్థితి ఏర్పడుతోంది. మరి రైతుకు తన ఉత్పత్తి ఖర్చులు, శ్రమ, రవాణా వ్యయం, తగిన లాభాన్ని పరిగణనలోకి తీసుకొని ధర పొందేలా బలమైన వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయకూడదు?

### కూరగాయల ధర పెరిగితే హడావుడి.. రైతుకు ధర తగ్గితే పట్టింపు లేదా?

టమాటా, ఉల్లి వంటి నిత్యావసర కూరగాయల ధరలు పెరిగితే వినియోగదారుల ఇబ్బందులపై చర్చలు మొదలవుతాయి. ప్రభుత్వాలు ధరల నియంత్రణ చర్యలు చేపడతాయి. రాజకీయ పార్టీలు స్పందిస్తాయి. మీడియాలోనూ విస్తృత చర్చ జరుగుతుంది.అయితే అదే కూరగాయల ధరలు పడిపోయి రైతు నష్టపోతే పరిస్థితి ఏమిటి? మార్కెట్‌కు తీసుకెళ్లిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతే రైతు పడే ఆవేదనపై అంతే స్థాయిలో చర్చ జరుగుతోందా? వినియోగదారుడికి సరసమైన ధర, రైతుకు గిట్టుబాటు ధర.. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించే విధానాలు ఎందుకు బలోపేతం కావడం లేదు? ధరలు పెరిగినప్పుడు వినియోగదారుడి ప్రయోజనాలు ఎంత ముఖ్యమో, ధరలు పడిపోయినప్పుడు రైతు ప్రయోజనాలు కూడా అంతే ముఖ్యం. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ ఈ రెండు వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి.

### రైతు సంఘాలు రాజకీయాలకు అతీతంగా పనిచేయలేవా?

రైతుల సమస్యలపై రాజకీయ పార్టీలకు అతీతంగా రైతులను ఏకం చేసే బలమైన ఉద్యమాలు, సంఘాలు అవసరం. రైతుల సమస్యలు కేవలం ఎన్నికల సమయంలో ప్రస్తావించే అంశాలుగా మిగిలిపోకూడదు. సాగునీరు, గిట్టుబాటు ధర, పంటల బీమా, నాణ్యమైన విత్తనాలు, మార్కెటింగ్ సదుపాయాలు, రుణభారం వంటి సమస్యలపై నిరంతర పోరాటం అవసరం. రైతు సంఘాలు కేవలం నిరసనలకే పరిమితం కాకుండా.. ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలి. రైతుల సమస్యలను గణాంకాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పరిష్కారాల కోసం సమిష్టిగా కృషి చేయాలి.

### వ్యవసాయ శాఖ అధికారుల బాధ్యత ఏమిటి?

రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వ వ్యవసాయ శాఖలు, క్షేత్రస్థాయి సిబ్బంది, వివిధ వ్యవసాయ సేవల వ్యవస్థలు ఉన్నాయి. అయినప్పటికీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తిగా ఎందుకు పరిష్కారం కావడం లేదు? వ్యవ సాయ శాఖ సేవలు రైతులకు ఎంతవరకు చేరుతున్నాయి? సాగు ప్రారంభం నుంచి పంట విక్రయం వరకు రైతుకు అవసరమైన మార్గదర్శకత్వం అందుతోందా? ప్రాంతానికి అనుగుణంగా పంటల ఎంపిక, నీటి వినియోగం, నేల ఆరోగ్యం, తెగుళ్ల నివారణ, సాగు ఖర్చుల తగ్గింపు, మార్కెట్ ధరల సమాచారం వంటి అంశాల్లో రైతులకు నిరంతర సహకారం అందించాలి. వ్యవసాయాన్ని కేవలం పంట పండించే ప్రక్రియగా కాకుండా.. రైతుకు ఆదాయం కల్పించే వృత్తిగా తీర్చిదిద్దాలి. లోపం ఎక్కడ ఉంది? విధానాల్లోనా? అమలులోనా? మార్కెటింగ్ వ్యవస్థలోనా? లేక రైతుకు అందాల్సిన సేవలు క్షేత్రస్థాయికి చేరడం లోనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికి, బాధ్యతాయుతమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

### రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది!

రైతు సమస్యలు పరిష్కరించకుండా వ్యవసాయ అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే. రైతుకు పెట్టుబడి భద్రత, సాగునీటి సదుపాయాలు, నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు, పంటలకు గిట్టుబాటు ధర, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తగిన సహాయం అందాలి.రైతు శ్రమకు విలువ దక్కినప్పుడే యువత వ్యవసాయాన్ని గౌరవప్రదమైన వృత్తిగా చూడ గలుగుతుంది. వ్యవసాయం లాభసాటిగా మారినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. రైతు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే దేశ ఆహార భద్రత మరింత పటిష్టమవుతుంది.

### రైతును మాటల్లో రాజు అని పిలవడం కాదు.. చేతల్లో అతని శ్రమకు గౌరవం ఇవ్వాలి.

రైతు పండించిన పంటకు న్యాయమైన ధర.. రైతు కుటుంబానికి ఆర్థిక భద్రత.. వ్యవసాయానికి స్థిరమైన భవిష్యత్తు కల్పించినప్పుడే "రైతే రాజు" అనే మాటకు నిజమైన అర్థం చేకూరుతుంది!

# ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

- ఒకే రోజు రెండుసార్లు ప్రకంపనలు
- ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం
- ఉత్తరకాశీలో 4.2 తీవ్రతతో ప్రకంపనలు
- శనివారం ఒక్కరోజే రెండుసార్లు కంపించిన భూమి
- బాగేశ్వర్‌లోనూ స్వల్ప తీవ్రతతో భూకంపం
- కొద్దిరోజుల క్రితం చమోలీలోనూ కంపించిన ధరణి




**ఉత్తరాఖండ్ – సూర్య వాస్తవం :**
ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు. ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### - ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సాకే నరేష్




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ సాకే నరేష్ డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, రిజర్వేషన్ల పరిరక్షణ, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ అవకాశాల కల్పన విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఇచ్చిన హామీలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలయ్యాయో ప్రభుత్వం వివరించాలని అన్నారు. బీసీలకు సంబంధించిన చట్టాలు, రిజర్వేషన్ల పరిరక్షణ, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాల కల్పనపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని కోరారు. బీసీలకు న్యాయం జరగాలంటే హామీలను ప్రకటనలకే పరిమితం చేయకుండా, వాటిని ఆచరణలో అమలు చేయాలని సాకే నరేష్ పేర్కొన్నారు. బీసీల హక్కులు, చట్ట బద్ధమైన ప్రయోజనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం తమ సమితి నిరంతరం పోరాడుతుందని, బీసీలకు న్యాయం జరిగే వరకు తమ గళాన్ని వినిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు తోపు చంద్ర, రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో గ్రామస్తులు ఐకమత్యంగా మట్టిరోడ్డు నిర్మాణం



**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామానికి సంబంధించిన ప్రధాన రహదారి తరాలు మారిన, ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఎన్నికల ముందు హామీ ఇవ్వడం గెలిచిన తర్వాత బిల్లు పెట్టినాము, బిల్లు మంజూరు కాగానే శాశ్వత రోడ్డు భద్రంగా ఉండేటట్లు రోడ్డు వేస్తామని ప్రతిసారి చెప్పుకుంటూ రావడం మాములుగా జరుగుతున్నదని,మా గ్రామం 44వ జాతీయ రహదారి నుండి ఎగువపల్లి గ్రామానికి వచ్చిపోయే విద్యార్థులకు చాలా ఇబ్బందికరంగా,ప్రమాద కరముగా ఉండుట వలన ఎగువపల్లి గ్రామస్తులందరూ ఐక్యమత్యానికి నిదర్శనముగా ఉక్కుమ్మడిగా 44వ.జాతీయ రహదారి నుండి ఎగువపల్లిగ్రామం వరకు గ్రామపెద్దల ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో రోడ్డుకు మట్టిని తోలించి నిర్మించుకున్నారు. ప్రభుత్వాల మీద నమ్మకం లేక ప్రజల కోసం విద్యార్థుల సౌకర్యం కోసం మా గ్రామ రహదారిని మేమే ఇంటింటి చందాలతో ఇంటికొకరు చొప్పున తోలిన మట్టిని సదులు చేసి నిర్మించుకున్నా మన్నారు. కావున అధికారులు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు పంచాయతీ, మండల అధికా రులు గమనించాలని, ప్రభుత్వ మాత్రం సంక్షేమం అభివృద్ధి వేగవంతం చేశామని ప్రచారాలు చేసుకుంటుందని, మాగ్రామాని నిర్మించిన వాటర్ ట్యాంక్ నుండి నీటి సరఫరా సరిగా లేక ప్రజలకు తాగునీరు ఎద్దడి ఏర్పడిందని, ప్రధాన రహదారిని పట్టించుకోలేదని, గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీలు సరిగా లేవు ఇదేనా ప్రభుత్వ సంక్షేమం అభివృద్ధి అని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

# అనంతపురం జెడ్పీకి రెగ్యులర్ డిప్యూటీ సీఈఓ

### - ఎట్టకేలకు సమత నియామకం.. ఎంపీడీఓలు, జెడ్పీ ఉద్యోగుల్లో హర్షం



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పరిషత్‌కు ఎట్టకేలకు రెగ్యులర్ డిప్యూటీ సీఈఓ నియామకం జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారిగా (డీపీఓ) పనిచేస్తున్న సమతను అనంతపురం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఆమెను శ్రీ సత్యసాయి జిల్లా డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి, తాజాగా అనంతపురం జెడ్పీకి నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో డిప్యూటీ సీఈఓగా పనిచేసిన లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య కడప జిల్లా పులివెందుల డీడీఓగా బదిలీ కావడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలను ఒక ఏఓకు అప్పగించారు. అయితే ఇన్‌చార్జి నియామకంపై ఉమ్మడి జిల్లా పరిధిలోని పలువురు ఎంపీడీఓలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ పరిణామాలతో ఎంపీడీఓలు జిల్లా పరిషత్‌కు రావడం తగ్గించారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సమతను రెగ్యులర్ డిప్యూటీ సీఈఓగా నియమించడం పట్ల ఎంపీడీఓలు, జిల్లా పరిషత్ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పూర్తిస్థాయి అధికారి బాధ్యతలు చేపట్టడంతో పరిపాలనా వ్యవహారాలు మరింత సజావుగా సాగుతాయని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఉద్యమం..

- అనంతపురంలో భారీ ర్యాలీ
- ఎస్ఐఆర్ రద్దు చేయాలి.. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానం తేవాలి
- ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.. నవాజ్ సాహెబ్




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం:** అనంతపురం ఓటర్ల హక్కులను పరిరక్షించాలని, ఎన్నికల విధానంలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అనంతపురం నగరంలో శనివారం యూజేఏసీ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని టవర్ క్లాక్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ ఎన్నికల కమిషన్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూజేఏసీ కన్వీనర్ సి. జాఫర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించ బడ్డాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ బాధ్యత వహించాలని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల కమి షన్ పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాజ్ సాహెబ్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇబ్బందులు కలిగించే చట్టాలను తీసుకొస్తోందని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగానే అనంతపురంలో ఈ ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అరెస్టు చేయడం, రాజకీయ నాయకులను నిర్బంధించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు కొనసాగితే భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు, యూ జేఏసీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని, ఓటర్ల జాబి తాలో పారదర్శకత పాటించాలని, ప్రజల ఓటు హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.



# తాడిపత్రిలో 'ఆపరేషన్ వజ్ర ప్రహార్'

### - 90 ఇళ్ల తనిఖీ.. 140 మందిని విచారించిన పోలీసులు
### - 10 ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ సీజ్.. - 31 మద్యం సీసాలు స్వాధీనం ఒకరి అరెస్ట్





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు తాడిపత్రిలో శనివారం పోలీసులు 'ఆపరేషన్ వజ్ర ప్రహార్' పేరుతో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. మొత్తం 249 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్న ఈ తనిఖీల్లో పలు ప్రాంతాల్లో ఇళ్లను తనిఖీ చేసి, అనుమానితులను విచారించారు. తాడిపత్రి టౌన్ పరిధిలోని టైలర్స్ కాలనీ, నందలపాడు, తాడిపత్రి రూరల్ పరిధిలోని ఇగుదూరు, గంగాదేవిపల్లి, వెంకటరెడ్డిపల్లి, బోడాయిపల్లి, ఆలూరు గ్రామాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 90 ఇళ్లను తనిఖీ చేసి, 140 మందిని విచారించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. అలాగే 31 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేశారు. సామాజిక శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్య కలాపాల నియంత్రణ, నేరాల నివారణ లక్ష్యంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

### ఛలో రాజ్‌భవన్‌ను అడ్డుకునేందుకు

# అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- అక్రమ అరెస్టులను తక్షణమే నిలిపివేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సింహమూర్తి డిమాండ్




**హిందూపురం - సూర్య వాస్తవం :** ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సింహమూర్తి అన్నారు. ఓట్ల చోరీ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యాలయాల్లోకి ప్రవేశించి నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయడం, ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రతి పౌరుడి హక్కు అని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్టు చేయడం సరైన చర్య కాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలను పోలీసుల బలంతో అణచివేయాలని చూడటం భావ ప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అక్రమ అరెస్టులను నిలిపివేయాలని, ఇప్పటికే అరెస్టు చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి, యువజన సంఘాలు ఐక్యంగా పోరాటం కొనసాగి స్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి బద్రీనాథ్‌తో పాటు కృష్ణ, రయాన్, కౌశిక్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభాకర్ చౌదరి జన్మదిన వేడుకలు



**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్రిమల ప్రభాకరచౌదరి 63వ జన్మదినాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈవేడుకలకు బొల్లు శ్రీనివాస్ రెడ్డి, గౌస్ పీరా, రఘునాథ్ రెడ్డి మోహన్ రెడ్డి బాబావాలి శ్రీనివాసులు హుస్సేన్ పీరా వెంకట్ రాముడు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## దేవాలయానికి కుర్చీలు, టేబుల్లు అందజేత...!

### - పుణ్యకార్యానికి శ్రీకారం చుట్టిన యువనేత జయకుమార్





**ధర్మవరం – సూర్య వాస్తవం :** ధర్మవరం పట్టణనికి చెందిన యువ నాయకులు గుట్టకింద పల్లి మాజీ సర్పంచ్ యల్లగొండ దాసరి పక్కిరప్ప ముని మనవడు దాసరి జయకుమార్, దాసరి రామశేషు కుటుంబ సభ్యులు కలిసి రామాలయం దేవాలయానికి 10 కుర్చీలు, రెండు భోజనాలు వడ్డించే టేబుళ్లు భజన చేయడానికి క్లాత్ మేట్ అందించారు. ఈ సందర్భంగా గుట్టకింద పల్లి రామాలయం కమిటీ సభ్యులు వారిని సన్మానిచ్చారు

## నవరాత్రి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

### - రేపటి నుంచి వాహన సేవలు



**తిరుమల-సూర్య వాస్తవం :** నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తిరుమల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం మూడేళ్లకోసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ చేస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ప్రధానంగా అక్టోబరు 16న గరుడ వాహన సేవ, 17న పుష్పక విమాన సేవ, 19న స్వర్ణ రథోత్సవం, 20న చక్రస్నాన వేడుక నిర్వహిస్తారు. వాహనసేవలు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. గరుడ వాహనసేవ మాత్రం సాయంత్రం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తారు.

# అరుదైన వ్యాధులతో పోరాడుతున్న
# చిన్నారులకు టీటీడీ అండగా నిలవాలి!




- డీఎండీ, ఎస్ఎంఏ బాధితులకు ప్రత్యేక వైద్య సహాయ పథకం ఏర్పాటు చేయాలి
- టీటీడీ ధర్మకర్తల మండలికి బాధిత చిన్నారుల తల్లిదండ్రులు, ప్రజల విజ్ఞప్తి
- ఖరీదైన చికిత్స కోసం క్రౌడ్‌ఫండింగ్‌పై ఆధారపడుతున్న కుటుంబాలు
- ఒక్క చిన్నారికి సాయం.. ఓ కుటుంబానికి జీవితాంతం భరోసా

**అనంతపురం – సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :** డుచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ (డీఎండీ), స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) వంటి అరుదైన వ్యాధులతో పోరాడుతున్న చిన్నారులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అండగా నిలవాలని బాధిత చిన్నారుల తల్లిదండ్రులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఖరీదైన వైద్య చికిత్సలు, మందులు, ఫిజియోథెరపీ, ఇతర వైద్య సేవల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఊరట కల్పించేలా ప్రత్యేక వైద్య సహాయ పథకాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**విరాళాల కోసం దాతల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు**

అరుదైన వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల చికిత్సకు భారీ మొత్తంలో ఖర్చవుతుండటంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయి. తమ పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలనే తపనతో పలువురు తల్లిదండ్రులు సోషల్ మీడియా, క్రౌడ్‌ఫండింగ్ వేదికల ద్వారా విరాళాలు సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందుకోసం దాతలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను సంప్రదిస్తూ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఒకవైపు పిల్లల ఆరోగ్యంపై ఆందోళన, మరోవైపు చికిత్సకు అవసరమైన నిధుల సమీకరణ.. ఈ రెండు సమస్యల మధ్య బాధిత కుటుంబాలు సతమతమవుతున్నాయి. తక్కువ సమయంలో భారీ మొత్తంలో డబ్బు సమీకరించడం అందరికీ సాధ్యం కాకపోవడంతో కుటుంబాల ఆవేదన వర్ణనాతీతంగా మారుతోంది. చికిత్సకు సంబంధించిన వైద్యుల సూచనలు, సమయపాలనను అనుసరించాల్సిన పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

**టీటీడీ ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి**

ఈ నేపథ్యంలో టీటీడీ ధర్మకర్తల మండలి మానవతా దృక్పథంతో స్పందించి డీఎండీ, ఎస్ఎంఏ బాధిత చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య సహాయ పథకాన్ని లేదా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అర్హత కలిగిన చిన్నారులకు వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, వైద్యుల సూచనల మేరకు అవసరమైన చికిత్స, మందులు, ఫిజియోథెరపీ వంటి సేవలు అందించే విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే అధిక వ్యయంతో కూడిన చికిత్స అవసరమైన సందర్భాల్లో అర్హత, వైద్య అవసరాలు, అందుబాటులో ఉన్న నిధులను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సహాయం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పారదర్శకమైన మార్గదర్శకాలతో వైద్య సహాయం అందిస్తే, బాధిత కుటుంబాలు ప్రతిసారీ సోషల్ మీడియా ద్వారా విరాళాల కోసం అభ్యర్థించాల్సిన పరిస్థితి కొంతవరకు తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

**మానవతా సేవకు మరో ముందడుగు కావాలి**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో మానవ సేవకు విశిష్ట స్థానం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అరుదైన వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సహాయం అందించే దిశగా టీటీడీ చొరవ తీసుకుంటే అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తుందని అంటున్నారు. ప్రత్యేక వైద్య సహాయ విధానం, నిధి ఏర్పాటు అంశాలను టీటీడీతో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాలు పరిశీలించి, సాధ్యమైన మేరకు సహాయక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అర్హులైన చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తే వారి కుటుంబాలకు ఆర్థికంగానే కాకుండా మానసికంగానూ ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు.

**మాకు పెద్దగా ఏమీ అవసరం లేదు.. మా పిల్లల వైద్యం ఆగిపోకుండా చూస్తే చాలు**

బాధిత చిన్నారుల తల్లిదండ్రుల ఆవేదనలోని ఈ మాటలు వారి పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. తమ పిల్లలకు మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్న కుటుంబాలకు సంస్థాగతంగా సహాయం అందితే భవిష్యత్తుపై మరింత ఆశ కలుగుతుందని వారు చెబుతున్నారు. ఒక్క చిన్నారికి అందించే సహాయం ఆ కుటుంబానికి కేవలం ఆర్థిక తోడ్పాటు మాత్రమే కాదు.. తమ బిడ్డకు వైద్యం కొనసాగుతుందనే భరోసా కూడా. అందుకే టీటీడీ ధర్మకర్తల మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని మానవతా దృక్పథంతో పరిశీలించి, బాధిత చిన్నారులకు అండగా నిలిచేలా నిర్ణయం తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– లక్ష్మీ జగదీశ్వర్
సూర్య వాస్తవం దినపత్రిక, అనంతపురం





# యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

### - మంత్రి సత్యకుమార్ యాదవ్




**విజయవాడ – సూర్య వాస్తవం:**
వికసిత్ భారత్--2047 నిర్మాణంలో విద్యార్థులే కీలకమని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై రాష్ట్రస్థాయి పోటీలను శనివారం విజయవాడలో బీజేపీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, తదితర పోటీలను మంత్రి సత్యకుమార్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని.. వారే రేపటి దేశ నిర్మాతలు, నాయకులు అని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వివరించారు.

**భారత్‌ను అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలి..**

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. అప్పటికీ భారతదేశాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పుకొచ్చారు. దేశాభివృద్ధిలో యువత ఆలోచనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. వైద్య కళాశాలలు, వైద్య విద్యలో సీట్లు, ఉన్నత విద్యాసంస్థల విస్తరణతో విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి సంస్థల విస్తరణ దేశ మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడుతోందని చెప్పారు.

**ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలి..**

పీఎం శ్రీ పాఠశాలలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. సెమీకండక్టర్లు, లిథియం బ్యాటరీలు, అరుదైన ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. యువత కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు స్థాపించి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలని అభిలాషించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములయ్యేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

# సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.కోటి నిధులు మంజూరు...

- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**సూళ్లూరుపేట- సూర్య వాస్తవం:** ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. శనివారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.1 కోటి మంజూరు కాగా,అందులో రూ.62.28 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ భూమిపూజ నిర్వహించారు. తొలుత నాగరాజపురంలో రూ.28.57 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మన్నారుపోలూరులో రూ.33.71 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుధాకర్ రెడ్డి,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు : సీఐ మనోహర్



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని బీసీసీ రోడ్డు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టిని సారించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరుగతున్నందున గ్రామాలలో ప్రత్యేకంగా రైతులు విద్యార్థులు ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడానికి కృషి చేస్తానని, ఈ విషయంపై మండల పరిధిలో గజరాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్థానిక సంస్థ ఎన్నికలలో ఎవరైనా మద్యం సేవించి గలాటాలు చేయడం గానీ, వేరే వారిని ఉద్దేశించి దుర్భాషలాడుట ఉండకూడదని ఎలాంటి గొడవలు జరిగినా రౌడీ షీటర్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతాంగం గ్రామంలో ఫ్యాక్షనిజం లేని గ్రామముగా మంచి పేరుందని, ఆ పేరు అలాగే నిలుపుకోవాలన్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా రైతులు గ్రామ పెద్దలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ దృష్టిలో పెట్టుకొని వాట్సాపులలో వచ్చే లింకులు ఓపెన్ చేయకూడదని, డబ్బులు నష్ట పోయిన బాధపడే దానికన్నా ముందే జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ. మనోహర్, సిబ్బంది రవీంద్ర, బాలకృష్ణ, హనుమంతు ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శభాష్ పెద్దయ్య....!

- నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ - చలి, దోమలతో ఇబ్బందులు పడుతున్న నిరాశ్రయులకు ఊరట - మానవసేవే మాధవ సేవ అంటూ సేవా కార్యక్రమం
- మానవత్వం చాటుకున్న ఏపీ పోలీస్ ఆఫీసర్స్ రాష్ట్ర ఈసీ మెంబర్ తలారి పెద్దయ్య

**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో నిరాశ్రయులకు అండగా నిలిచి ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఈసీ మెంబర్, అనంతపురం 14వ బెటాలియన్ జిల్లా అధ్యక్షుడు తలారి పెద్దయ్య మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నివసిస్తున్న తల్లి, పిల్లలు దోమలు, రాత్రివేళల్లో చలి కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ఆయన వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. స్వయంగా దగ్గరుండి దుప్పట్లు అందజేసి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తలారి పెద్దయ్య మాట్లాడుతూ.. "మానవసేవే మాధవ సేవ" అనే సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పేదలకు అండగా నిలవడం, అనాథలు, నిరాశ్రయులకు భోజనం అందించడంతో పాటు అవసరమైన వారికి దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతో సంతోషాన్ని, ఆత్మతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి తోడ్పడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు నిరాశ్రయులను ఆదుకోవడానికి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.



# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

**సూళ్లూరుపేట -సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్సలు పొందిన పేద,మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 65 మంది లబ్ధిదారులకు రూ.34, 15,234 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం ఇద్దరు లబ్ధిదారులకు రూ.4,09,802 విలువైన లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఓ సి) అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 738 మంది లబ్ధిదారులకు రూ.6,39, 31,190 (రూ.6.39 కోట్లు) ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,వైద్య ఖర్చుల కారణంగా ఏ పేద కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాయుడుపేట టిడిపి టౌన్ అధ్యక్షులు రఫీ,దొరవారిసత్రం తెలియజేసిన పార్టీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాస నాయుడు,మరియు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ త్రిశూల్‌తో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు

- ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల అవగాహన కార్యక్రమాలు
- ఆటో, బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, ప్రయాణికుల భద్రతపై సూచనలు.
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తత.. ప్రజలకు పోలీసుల అవగాహన

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్న ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ నిబంధనల అమలు, శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీస్ అధికారి ఆధ్వర్యంలో ఆటో,బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి వన్‌టౌన్ ,టూటౌన్, రూరల్ సీఐలతో పాటు సంబంధిత ఎస్ఐలు పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, మాద ద్రవ్యాల రవాణా, అనుమానాస్పద కార్యకలా పాలపై అప్రమత్తంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. ఏదైనా నేరం లేదా అనుమానాస్పద ఘటన గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. అలాగే,ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని తెలిపారు. మరోవైపు, డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఎన్నికల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మహిళలపై నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు,రోడ్డు ప్రమాదాల నివారణ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రజల భద్రత,ఎన్నికల ప్రశాంత నిర్వహణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోంది. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.





# ఎన్నికల వేళ పోలీసుల అప్రమత్తత.. జిల్లా వ్యాప్తంగా గస్తీ ముమ్మరం

- 9 సమస్యాత్మక గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్..
- గ్రామసభలతో ప్రజలకు అవగాహన
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రశాంత ఎన్నికలకు పోలీసులకు సహకరించాలి: జిల్లా ఎస్పీ పి. జగదీష్,

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం రాబోయే ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రధాన ప్రాంతాలతో పాటు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో పోలీసుల నిఘాను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు పోలీసులు ఫుట్ పెట్రోలింగ్, ప్రత్యేక గస్తీ నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. జిల్లాలోని 9 సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేకంగా గస్తీని పెంచడంతో పాటు పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు



తీసుకుంటున్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా పోలీసులు ఓటర్లకు పలు సూచనలు చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీ సులకు సహకరించాలని జిల్లా పోలీసు యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ప్రజల భాగస్వామ్యంతో శాంతియుత ఎన్నికల నిర్వహణకు కృషి చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## అందుకే 'బాషా 2'కి నో చెప్పా..

# 'జైలర్ 2'కు ఓకే చెప్పా: రజనీకాంత్



సూపర్‌స్టార్ రజనీకాంత్ సాధారణంగా సీక్వెల్ సినిమాలకు దూరంగా ఉంటారు. గతంలో 'బాషా 2', 'పేట 2' చిత్రాల ఆఫర్లను కూడా తిరస్కరించారు. కానీ 'జైలర్ 2' విషయంలో మాత్రం వెంటనే అంగీకరించారు. ఎందుకలా? కేవలం సినిమా విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోలేదని రజనీకాంత్ చెప్పారు. కథలోనే రెండో భాగానికి బలమైన పునాది ఉండటంతో ఓకే చెప్పానని వెల్లడించారు.'జైలర్ 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. సాధారణంగా మొదటి భాగంలోని కథకు కొన్ని కొత్త అంశాలు జోడించి రెండో భాగాన్ని తెరకెక్కిస్తారని తాను భావిస్తానని రజనీ తెలిపారు. అందుకే సీక్వెల్స్‌పై పెద్దగా ఆసక్తి చూపనని చెప్పారు.గతంలో 'బాషా 2'కి అంగీకరించలేదని, విజయ్ సేతుపతి పాత్రను కొనసాగిస్తూ 'పేట 2' తీయాలన్న దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు ప్రతిపాదనను కూడా తిరస్కరించానని గుర్తు చేసుకున్నారు.

**'జైలర్' క్లైమాక్సే కారణం!**

'జైలర్' సినిమా ఓటీటీలో విడుదలైన తర్వాత మరోసారి చూశానని రజనీకాంత్ చెప్పారు. అప్పుడు సీక్వెల్ ఆలోచనపై తన అభిప్రాయం మారిందన్నారు. క్లైమాక్స్‌లో విగ్రహాల స్మగ్లర్ వర్మ చనిపోయే ముందు జైలర్ ముత్తువేల్ పాండియన్‌ను ఓ పెద్ద నెట్‌వర్క్ గురించి హెచ్చరిస్తాడు. ఆ నెట్‌వర్క్ గురించి సినిమా అంతటా దర్శకుడు నెల్సన్ చిన్నచిన్న సంకేతాలు ఇచ్చాడని రజనీ వివరించారు.

అంతేకాదు.. రూ.వేల కోట్ల విలువైన మూడు కంటైనర్లు జైలర్ దగ్గర ఉండటం, నాగ్‌పూర్ జైలులో పనిచేసిన సమయంలోనే కరుడుగట్టిన రౌడీలు, దాదాల్లో ముత్తువేల్ పాండియన్‌పై భయం, గౌరవం ఉండటం వంటి అంశాలు రెండో భాగానికి సహజమైన పునాదిగా అనిపించాయని చెప్పారు.ఈ అంశాలన్నీ గుర్తించిన తర్వాత తానే దర్శకుడు నెల్సన్‌కు ఫోన్ చేసి 'జైలర్ 2'కి అంగీకరించినట్లు రజనీకాంత్ వెల్లడించారు. కేవలం కమర్షియల్ విజయాన్ని ఆశించి కాకుండా, కథకు కొనసాగింపు ఉండటమే తన నిర్ణయానికి కారణమని స్పష్టం చేశారు.సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రంలో విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటించారు. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా అక్టోబరు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అందుకే, నా సినిమా టికెట్ ధరలు పెంచవద్దని చెబుతాను : విజయ్ దేవరకొండ




యువ హీరో విజయ్ దేవరకొండ తన చిత్రాల టికెట్ ధరల పెంపుపై కీలక వ్యాఖ్యలు చేశాడు. దసరా కానుకగా విడుదల కానున్న తన తాజా చిత్రం 'రణబాలి' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణ స్టూడియోలో మీడియాతో మాట్లాడాడు. తన పరిధిలో ఉన్నంత వరకు సినిమాల టికెట్ ధరలను పెంచనివ్వబోనని ఈ సందర్భంగా స్పష్టం చేశాడు.తాను విద్యార్థిగా ఉన్న సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఇందుకు కారణమని విజయ్ వివరించాడు. "కళాశాల రోజుల్లో మా నాన్న రోజూ పది రూపాయలు ఇచ్చేవాడు. ఆ నగదును పొదుపు చేసి ఐమ్యాక్స్‌లో సినిమాలు చూసేవాడిని. అప్పట్లో టికెట్ ధర రూ.100 పెరిగినప్పుడు ఎంతో బాధపడ్డాను. అందుకే ఇప్పుడు నా సినిమాల టికెట్ రేట్లు పెంచవద్దని నిర్మాతలకు సూచిస్తుంటాను. అవసరమైతే నా లాభాల్లో వాటాను తగ్గించుకోవడానికైనా సిద్ధమే" అని తెలిపాడు. అయితే, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చిత్రాలకు మాత్రం ఇది మినహాయింపు అని సరదాగా పేర్కొన్నాడు.విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రణబాలి'. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానుంది. బ్రిటిష్ పాలనలో 1876-78 మధ్య రాయలసీమ ప్రాంతంలో సంభవించిన తీవ్ర కరవు నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటించగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కీలక ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించారు.బయోపిక్స్‌ల గురించి మాట్లాడుతూ, తనకు ఎప్పటి నుంచో సత్యసాయి బాబా జీవితగాథలో నటించాలనే ఆసక్తి ఉండేదని, కానీ ఆ పాత్రకు అవసరమైన పవిత్రత, సున్నితత్వం తనలో లేవని భావించి వెనక్కి తగ్గినట్లు విజయ్ వెల్లడించాడు. 'పెళ్లి చూపులు' తర్వాత 'రణబాలి' తనకు అత్యంత సంతృప్తినిచ్చిన చిత్రమని పేర్కొన్నాడు. తాను ఇప్పటికే ఈ సినిమాను రెండు మూడు సార్లు వీక్షించానని, సోమవారానికల్లా సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తవుతాయని తెలిపాడు.




## సెట్స్‌పైకి 'శ్రీమతి'..

### షూటింగ్‌కు ముందు ఎమోషనల్ అయిన నివేదా థామస్

నటి నివేదా థామస్ తన కొత్త సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. 'శ్రీమతి' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనబోయే ముందు, తన అనుభూతులను ఆమె సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. కొత్త సెట్‌లో అడుగుపెట్టే ముందు ఉత్సాహంతో పాటు కాస్త నెర్వస్‌గా ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా నివేదా తన పోస్ట్‌లో, "కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది తెలిసిన ప్రపంచమే అయినా, తనదైన శైలిలో చాలా కొత్తగా, బలంగా అనిపిస్తోంది. కొత్త సెట్‌లో మొదటి రోజు షూటింగ్‌కు వెళ్లే ముందు నాలో ఒకరకమైన నెర్వస్ ఎనర్జీ ఉంటుంది. అది ఆందోళన కాదు, సినిమా మొదలుపెడుతున్నాననే ఉత్సాహం. ఒకమ్మాయి సినిమా షూటింగ్‌కు బయల్దేరింది" అని రాసుకొచ్చారు.'శ్రీమతి' చిత్రాన్ని జీ5 తెలుగు ఒరిజినల్‌గా, ఒక ఫ్యామిలీ డ్రామాగా రూపొందిస్తున్నారు. విశ్వక్ ఖండేరావు దర్శకత్వం వహిస్తుండగా, 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని నిర్మించిన ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.2024లో వచ్చిన '35 చిన్న కథ కాదు' సినిమాతో నివేదా థామస్ భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, తన నటనకు గాను ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డు, గద్దర్ తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర పురస్కారాన్ని కూడా గెలుచుకున్నారు. ఆ ఘన విజయం తర్వాత ఆమె నటిస్తున్న సినిమా కావడంతో 'శ్రీమతి'పై అభిమానుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.



## మళ్లీ పరుగుల వరదేనా?

# భారత బౌలర్లకు మరో అగ్నిపరీక్ష!




భారత్, వెస్టిండీస్ మధ్య మరో హైస్కోరింగ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రెండో టీ20లో పరుగుల వరద పారగా.. ఇప్పుడు మూడో టీ20లోనూ బ్యాటర్లదే ఆధిపత్యం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్ ఉండటంతో బౌలర్లకు మరోసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. ఈ రోజు రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ జరగనుంది.రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు కలిపి ఏకంగా 501 పరుగులు చేశాయి. తొలుత భారీ స్కోరు చేసిన భారత్‌ను వెస్టిండీస్ దీటుగా ఎదుర్కొంది. 250 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ మిగిలి ఉండగానే ఛేదించి సంచలన విజయం సాధించింది. దీంతో భారత బౌలింగ్ వైఫల్యాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బౌలర్ల ప్రదర్శనపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇండోర్ పిచ్ కూడా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందని అంచనా. చిన్న బౌండరీలకు తోడు మంచు ప్రభావం కూడా మ్యాచ్‌పై కీలక పాత్ర పోషించనుంది. దీంతో బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా బంతులు వేయాల్సి ఉంటుంది. ఫీల్డింగ్‌లోనూ చిన్న తప్పిదాలకు అవకాశం ఇవ్వకూడదు.రాంచీలో భారత పేసర్ మయాంక్ యాదవ్ పవర్‌ప్లేలో మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. అయితే షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను వదిలేయడం భారత్‌కు భారంగా మారింది. ఆ సమయంలో 18 బంతుల్లో 38 పరుగులతో ఉన్న రూథర్‌ఫోర్డ్.. ఆ తర్వాత 37 బంతుల్లో 84 పరుగులు చేసి చెలరేగాడు. ఏడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ షాయ్ హోప్‌తో కలిసి 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. హోప్ కూడా అజేయ శతకంతో జట్టును గెలిపించాడు.

ఈ సిరీస్‌లో హోప్ ఇప్పటికే రెండు సెంచరీలు సాధించడంతో భారత బౌలర్లకు అతడిని త్వరగా ఔట్ చేయడం కీలకం. మయాంక్‌కు అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే, నమన్ ధీర్ నుంచి సహకారం అవసరం.మరోవైపు భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి రావడం జట్టుకు సానుకూలాంశం. ఇండోర్‌లో అజేయంగా 102 పరుగులు చేసిన అతడు.. రాంచీలో 18 బంతుల్లోనే 40 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కూడా 41 బంతుల్లో 82 పరుగులతో ఫామ్ అందుకున్నాడు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం రావడం కష్టంగా కనిపిస్తోంది. వెస్టిండీస్ మాత్రం రూథర్‌ఫోర్డ్, హోప్ ఫామ్‌తో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. రోస్టన్ చేజ్ కూడా రెండో టీ20లో మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో మూడో టీ20లో బ్యాటర్ల జోరు కొనసాగుతుందా? భారత బౌలర్లు పుంజుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.



## కోచ్‌తో గొడవ..

### జాతీయ జట్టుకు ఫుట్‌బాల్ దిగ్గజం రొనాల్డో దూరం!

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఎదురుదెబ్బ తగిలింది. జాతీయ జట్టు శిబిరం నుంచి ముందుగానే వెళ్లిపోవడంతో పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఫ్‌పీఎఫ్) అతడిపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. ఈ కేసును అత్యవసరంగా విచారించాలని నిర్ణయించింది. అయితే, రొనాల్డోకు ఎలాంటి శిక్ష విధించాలనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. 41 ఏళ్ల రొనాల్డో.. డెన్మార్క్‌తో నేషన్స్ లీగ్ మ్యాచ్‌కు ముందు జట్టు శిబిరాన్ని వీడాడు. జట్టులో తనకు ఎంతసేపు ఆడే అవకాశం ఇవ్వాలనే విషయంలో కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై అక్టోబర్ 9న క్రమశిక్షణ విచారణ ప్రారంభించినట్లు ఎఫ్‌పీఎఫ్ తెలిపింది. తొలుత రొనాల్డోపై తాత్కాలిక సస్పెన్షన్ విధించగా, ఆ తర్వాత మరో చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. విచారణ పూర్తయ్యే వరకు వివరాలను బయటపెట్టబోమని స్పష్టం చేసింది.తాను జట్టు శిబిరం నుంచి వెళ్లిపోవడంపై రొనాల్డో ఇప్పటికే సహచర ఆటగాళ్లకు, పోర్చుగల్ అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. తన తప్పునకు తగిన శిక్ష విధించాలని ఫుట్‌బాల్ సమాఖ్యను కోరాడు. జట్టు కెప్టెన్ అయినంత మాత్రాన చర్యల నుంచి మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేశాడు.నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచింది. అయితే, ఆ మ్యాచ్‌లో రొనాల్డోకు ఆడే అవకాశం రాలేదు. తనకు 30 నిమిషాలు ఆడే అవకాశం ఇస్తానని కోచ్ చెప్పి, ఆ తర్వాత మాట మార్చారని రొనాల్డో ఆరోపించాడు. అలాంటి ఒప్పందం ఏదీ లేదని కోచ్ ఖండించాడు.మరోవైపు, క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో మళ్లీ సత్తా చాటాడు. అల్ నస్ర్ తరఫున దిరియా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గోల్ చేసి, తన కెరీర్ గోల్స్ సంఖ్యను 980కి చేర్చాడు. ఈ మ్యాచ్‌లో అల్ నస్ర్ 3-0తో విజయం సాధించింది. ఇప్పుడు పోర్చుగల్ సమాఖ్య విచారణలో ఎలాంటి నిర్ణయం వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## నేటి నుంచి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభం

**- ఈ నెల 21 వరకు వైభవంగా ఉత్సవాలు.. భక్తులకు అన్ని ఏర్పాట్లు**





**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవ స్థానంలో ఆదివారం (అక్టోబర్ 11) నుంచి ఈ నెల 21వ తేదీ వరకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భక్తులు, ఆర్యవైశ్య సోదరులు, సోదరీమణులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు కోరారు.

## 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగం

**తిరుపతి-సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు, నగరాల్లో వ్యాపారాలు, నివాస గృహాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత నిబంధనలు తెస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్-2026 ను అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న సంక్లిష్టమైన విభిన్న జోనింగ్ నిబంధనలను రద్దు చేసి, ఆధునిక అవసరాలకు తగినట్లుగా కేవలం 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగాన్ని క్రమ బద్ధీక రించారు. ఈ నూతన విధానంలో అత్యంత కీలకమైన అంశం నెగిటివ్ లిస్ట్ విధానాన్ని ప్రవేశపెట్టడం. గతంలో ఒక నిర్దిష్ట భూమిలో ఏ నిర్మాణానికి అనుమతి ఉందో తెలుసుకోవడానికి పౌరులు, డెవలపర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు నెగిటివ్ లిస్ట్ ద్వారా సదరు జోన్‌లో ఖచ్చితం ప్రోహిబిటెడ్ కార్యకలాపాలు మినహా, మిగిలిన అనుకూల ప్రాజెక్టులన్నింటికీ ఆటోమేటిక్‌గా అనుమతులు లభించే వీలుంది. ఈ పారదర్శక విధానం వల్ల అధికారులు నిబంధనల పేరుతో చేసే అనవసర ఆటంకాలకు, అవినీతికి శాశ్వత చెక్ పడనుంది. ఈ కొత్త జోనింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఇటీవలే సమగ్రంగా సవరించిన 'ఏపీ బిల్డింగ్ రూల్స్'ను కూడా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 24 మీటర్లు , అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను 'హైరైజ్' భవనాలుగా పరిగణిస్తూ, వాటికి అవసరమైన ఫైర్, పర్యావరణ అనుమతులను డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకే గొడుగు కిందకు తెచ్చారు. అంతేకాకుండా, పెద్ద నివాస, వాణిజ్య కాంప్లెక్స్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు, 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ఆఫీసుల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని నిబంధనల్లో భాగం చేశారు. ఈ జోనింగ్ సంస్కరణల వల్ల గృహ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరి అందడమే కాకుండా, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత మెరుగవుతుంది. సుదీర్ఘకాలంగా మాస్టర్ ప్లాన్లు, భూ వినియోగ మార్పిడుల వివాదాల్లో చిక్కుకున్న భూములకు స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తి వ్యాపారం, మౌలిక వసతుల కల్పన వేగవంతం కానున్నాయి

## కాసులు కురిపిస్తున్న మొగలి పువ్వులు

**శ్రీకాకుళం -సూర్య వాస్తవం :**కాకుళం జిల్లాలో రైతులు వినూత్నంగా మొగలి సాగు చేస్తున్నారు. మొగలి మొక్కల్ని నాటి పుష్పాలతో లాభాలు పొందుతున్నారు. మొగలి పుష్పాల నుంచి తీసిన ఆయిల్‌తో భారీగా ఆదాయం వస్తోంది. మొగలి పువ్వుల నుంచి తీసిన ఆయిల్ లీటర్ రూ. 2.50 లక్షలు పలకుతోంది.. సీజన్‌లో అంతకుమించి కూడా డిమాండ్ ఉంటోంది. ఈ ఆయిల్‌ను ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.మొగలి పువ్వుల గురించి మనం వినే ఉంటాం.. కొంతమంది ఇళ్ల దగ్గర ఈ మొగలి చెట్లను పెంచుతుంటారు. రైతులు పొలాలు, కాలువ గట్లపై కూడా పెంచుతారు.



తీర ప్రాంతాల్లో ఉండే భూములకు ఈ మొగలి చెట్లు ఎత్తుగా, దట్టంగా పెరిగి రక్షణ గోడగా నిలుస్తాయి. అలాంటి మొగలి చెట్లు శ్రీకాకుళం జిల్లాలో రైతులకు ఆదాయాన్ని తెస్తున్నాయి.. పలు మండలాల్లో దాదాపు 6 వేల హెక్టార్లలో మొగలిని సాగు చేస్తున్నారు. ఈ మొగలి పువ్వుల్ని ఎగుమతి చేసి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడి నుంచి మొగలి పువ్వులు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.ఒక్క కొమ్మ నాటితే ఏడాదిలోగా పిలకలువేస్తూ కంచెగా మారుతుంది. అలాగే ఈ చెట్లకు తెగుళ్లు కూడా రావు.. చుక్కనీరూ అవసరం లేదు. ఏడాదిలో ఒక్కో మొగలి చెట్టు నుంచి నాలుగు నెలల పాటు వెయ్యి పూల వరకు వస్తాయి. మొగలి పువ్వును రైతులు దాదాపు రూ.14 నుంచి 16 వరకు విక్రయిస్తున్నారు. అదే సీజన్‌లో అయితే ఈ ధర ఎక్కువగా ఉంటుంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ పూలకు డిమాండ్ ఉంటుంది. అంతేకాదు శ్రీకాకుళం జిల్లాలో ఈ మొగలి పువ్వుల నుంచి అత్తరు తయారు చేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి. అక్కడ ఇత్తడి పాత్రల్లో ఈ మొగలి పువ్వులను వేసి వేడి చేస్తారు.. అనంతరం అందులో నుంచి వచ్చే ఆవిరినిమరో పాత్రలోకి వెళ్లేలా చూస్తారు. అక్కడ చల్లబడిన నూనెను మరో పాత్రలో నిల్వ చేస్తారు.ఈ నూనె సీజన్‌ను బట్టి లీటర్ రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పలుకుతుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ నూనెను చైనా, రష్యా, అమెరికా వంటి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. కాన్పూర్, భువనేశ్వర్, జైపూర్, కోల్‌కతా వ్యాపారులు కూడా ఈ ద్రావణాన్ని కొనుగోలు చేస్తారు. ఈ ద్రావణం ఒక లీటరు సేకరించాలంటే.. దాదాపు 20వేల మొగలి పువ్వులు కావాలి. ఈ ద్రావణాన్ని కాస్మెటిక్స్, ఔషధాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అంతేకాదు కీళ్ల సంబంధిత వాత నొప్పులు తగ్గిస్తుందని చెబుతుంటారు. ఈ మొగలి పువ్వల నుంచి తీసే ద్రావణాన్ని ఒడిశాలోని అగర్‌బత్తీల తయారీకి కూడా పంపిస్తుంటారు. ఈ మొగలి సాగు కూడా వ్యవసాయ అనుబంధంగా ఉందని.. తమకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తే బావుంటుందని రైతులు కోరుతున్నారు.వాస్తవానికి సముద్ర తీర ప్రాంతాలతో పాటుగా కొబ్బరి, జీడిమామిడి తోటలకు రైతులు కంచెలా ఈ మొగలి మొక్కల్ని పెంచుతుంటారు. పొలం గట్లపై, కాలవ గట్లపై కనిపించే ఈ మొగలి చెట్లు ఇప్పుడు రైతులకు ఆదాయాన్ని తీసుకొచ్చేవిగా మారాయి. కొంతమంది రైతులు కొబ్బరి తోటలతో నష్టాలు వచ్చాయని.. వాటిని తొలగించి మొగలి మొక్కల్ని నాటుతున్నారు. ఈ పుష్పాల ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతులు మాత్రమే కాదు మరికొన్ని చోట్ల కూడా కొంతమంది మొగలి సాగుకు సిద్ధమవుతున్నారు.

# నేటి నుంచి శ్రీ ఈశ్వరీదేవి మఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు

**- ఈ నెల 21వ తేదీ వరకు వైభవంగా ఉత్సవాలు..**
**- తొమ్మిది రోజుల పాటు అమ్మవారి విశేష అలంకరణలు**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** కందిమల్లా యపల్లెలోని శ్రీ వీరబ్రహ్మ క్షేత్రంలో వెలసిన జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠంలో ఆదివారం నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభం కానున్నాయి. మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరశివకు మారస్వాముల వారి ఆధ్వర్యం లో, భక్తుల సహకారంతో అక్టోబర్ 11 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

**అమ్మవారికి ప్రతిరోజూ విశేష అలంకరణలు**

ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 11న దీక్షా కలశ స్థాపన, కలశోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 12న శ్రీ బాలాత్రిపురసుందరీదేవి, 13న శ్రీ గాయత్రీదేవి, 14న శ్రీ అన్నపూర్ణా దేవి, 15న శ్రీ లలితాదేవి, 16న శ్రీ మహాలక్ష్మీదేవి, 17న శ్రీ సరస్వతీదేవి, 18న శ్రీ దుర్గాదేవి, 19న శ్రీ మహిషాసురమర్దినీదేవి అలంకరణల్లో అమ్మ వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా శ్రీ ఈశ్వరీ మహాదేవి శమీ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 21న మహాప్రసాద వినియోగం జరగనుంది.

**త్రికాల పూజలు.. కుంకుమార్చనలు**

ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంకాలం త్రికాల అభిషేకాలు, కుంకుమార్చనలు, నివేదనలు, రాత్రివేళ అమ్మవారి ప్రత్యేక అలంకరణలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కావున భక్తులందరూ శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో భాగస్వాములై అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి తరించాలని మఠం దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఈశ్వరి దేవి మఠం కార్యనిర్వహణాధికారి సి. శంకర బాలాజీ కోరారు.



# బెజవాడకు దళపతి విజయ్

**విజయవాడ-సూర్య వాస్తవం:** తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపి స్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకా వాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సాను కూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి. తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది.




విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను బట్టి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకే ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చని భావిస్తున్నారు. తమిళనాట విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయ స్థాయిలోనూ ఆసక్తి రేపుతున్న తరుణంలో, ఆయన ఏపీ టూర్ ఖరారైతే అది తెలుగు రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు తెరలేపడం ఖాయం.

# బ్యాలెట్ తో ఎన్నికలు




**విజయవాడ-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొం దించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో నడుస్తున్న న్యాయపరమైన ప్రక్రియను కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని ఎస్ఈసీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి తుది తీర్పు , స్పష్టమైన ఆదేశాలు వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా బలగాల మోహరింపును దృష్టిలో ఉంచుకుని స్థానిక పోరును ఏకకాలంలో కాకుండా విడతల వారీగా నిర్వహిం చేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల దశలను పక్కా ప్రణాళికతో చేపట్టేలా కసరత్తు చేస్తున్నామన్నారు.

ఉన్నతాధికారుల సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, నిధుల సమీకరణ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికార యంత్రా ంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహ రించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రక్రియ చట్టబద్ధంగా సాగేలా గట్టి నిఘా ఉంచాలని పునేఠా స్పష్టం చేశారు. న్యాయస్థానం వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించడంతో వచ్చే రెండు, మూడు నెలలు స్థానిక ఎన్నికల హంగామా కనిపించనుంది.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140